www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 8 జూన్ 2023
5
తూర్పుగోదావరి

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

హుకుంపేట 33/11 కెవి సబ్ స్టేషన్‌లో అత్యవసర పనులు, మరమ్మతుల నిమిత్తం సబ్-స్టేషన్ పరిధిలోని హుకుంపేట, ఆదర్శ నగర్, రామకృష్ణనగర్ ఫీడర్స్‌కు గురువారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలిపేస్తామని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. సావిత్రి నగర్, హుకుంపేట, వరలక్ష్మి కాలనీ, జన చైతన్య నగర్, రామకృష్ణ నగర్, ఆదర్శ నగర్, బాలాజీ పేట తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు దీనికి సహకరించాలని కోరారు. అలాగే కలవచర్ల విద్యుత్ సబ్-స్టేషన్ పరిధిలోని కలవచర్ల , సీతారాంపురం గ్రామాల్లో వ్యవసాయ బోర్లకు కూడా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు

పాఠ్యపుస్తకాలు అందేనా?

ఇప్పటికే ప్రారంభమైన ఇంటర్ తరగతులు విద్యార్థుల్లో అయోమయం, గతేడాది అందని పుస్తకాలు

ప్రజాశక్తి రాజమహేంద్రవరం ప్రతినిధి

ఉచిత పాఠ్య పుస్తకాలను పంపిణీ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఇంటర్మీడియట్ విద్యాసంవత్సరం ప్రారంభమైన విషయం విధితమే. అయితే ఇప్పటికీ ప్రభుత్వ, సంక్షేమ తదితర జూనియర్ కళాశాలల విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు అందలేదు. ఇంటర్ విద్యామండలి నిధులతో పాఠ్య పుస్తకాలు విద్యా సంవత్సరం ప్రారంభంలో పంపిణీ చేయాల్సి ఉంది. అయితే గత ఏడాది పుస్తకాల ముద్రణపై స్పష్టత కొరవడడంతో పుస్తకాలు అందే పరిస్థితి కన్పించట్లేదు. జిల్లాల విభజన తర్వాత ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో స్టాక్ ఉన్న కొన్ని పుస్తకాలను అరకొరగా విద్యార్థులకు పంపిణీ చేసి అధికారులు చేతులు దులుపుకున్నారు. మరోవైపు తాము బోధించిన పాఠ్యాంశాల్లో విద్యార్థులకు తలెత్తే సందేహాలను ఏమేరకు నివృత్తి చేసుకోగలరన్న ఆందోళన అధ్యాపకులను వెంటాడుతోంది. గతేడాది ఫలితాల్లో ప్రథమ ఇంటర్‌లో ఉత్తీర్ణతతో వెనుకబడిన వారికి ఈ ఏడాదిలో మెరుగైన ఉత్తీర్ణత సాధించడం ప్రశ్నార్థకంగా మారింది. మరోపక్క పుస్తకాలు లేకుండా పిల్లలు ఎలా చదువుతారనే ప్రశ్నలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వ్యక్తమవుతున్నాయి. కొంతమంది తల్లిదండ్రులు రూ.వేలు వెచ్చించి బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేసే అవకాశం లేక ఇబ్బందులు తప్పేలా లేవు.

గతేడాది పాత పుస్తకాలతో సరి

ప్రభుత్వం సకాలంలో పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయకపోవడంతో గతేడాది సీనియర్ల వద్ద సేకరించిన పుస్తకాలను జూనియర్లకు అందజేశారు. గత లేని పరిస్థితుల్లో ఆ పాత పుస్తకాల ద్వారానే విద్యార్థులు పాఠ్యాంశాలను అభ్యసిస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ఎపిఆర్‌జెసి, కెజిబివి, ఎపిమోడల్, సాంఘిక సంక్షేమ, ఎపి ట్రైబల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలల ఉన్నాయి. ఆయా కళాశాలల్లో అభ్యసించే విద్యార్థులకు

ఆందోళనలో ఇంటర్మీడియట్ విద్యార్థులు

ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందించాల్సి వుంది. జిల్లాల విభజన తర్వాత ప్రతి మండలంలో ఓ బాలికల జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారు. వీటిలో చేరిన విద్యార్థులకు కూడా ప్రభుత్వమే ఉచితంగా పుస్తకాలు అందించాలి. దీనికితోడు జిల్లాలో ఇంటర్‌బోర్డు గుర్తింపు ద్వారా నడుస్తున్న ప్రయివేట్ అన్‌ఎయిడెడ్, ప్రయివేటు ఒకేషనల్ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు కూడా ప్రభుత్వమే పాఠ్యపుస్తకాలు ముద్రించి విక్రయించాల్సి ఉంది. ప్రభుత్వ, ప్రయివేటు యాజమాన్యాల పరిధిలోని 356 కళాశాలు ఉన్నాయి. ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్స్ నుంచి అన్ని టైటిల్స్‌కు సంబంధించిన ఇండెంట్ తీసుకున్నారు గాని పాఠ్యపుస్తకాలు మాత్రం సరఫరా చేయలేదు.

జిల్లాలో సకాలంలో పుస్తకాలు పంపిణీ చేయకపోవడంతో విద్యార్థుల్లో ఆందోళన నెలకొంది. గత సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల్లో జిల్లా వెనుకబడిన విషయం విదితమే. గత అనుభవాల నుంచి విద్యార్థులకు పాఠ్యపుస్తకాల అందించేందుకు అధికార యంత్రాంగం చొరవ చూపించాల్సి ఉంది. ఈ విద్యాసంవత్సరంలో మొదటి రెండో సంవత్సర విద్యార్థులకు జిల్లాలో అన్ని సబ్జెక్టులకు కలిపి ఇంటర్ బోర్డుకు ఇండెంట్ పెట్టినట్లు డిఐఇఒ తెలిపారు. పుస్తకాల కోసం ఇంటర్మీడియట్ బోర్డుకు ఇండెంట్ పంపించామని, సరఫరా చేసిన వెంటనే విద్యార్థులకు అందిస్తామని చెప్పారు. ఈలోపు సీనియర్ విద్యార్థుల వద్ద ఉన్న పుస్తకాలను జూనియర్లకు అందించేలా చర్యలు చేపట్టామని తెలిపారు.

నిడదవోలు తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

వైసిపి నాయకుడు కొండలరావును శిక్షించాలి

ప్రజాశక్తి - నిడదవోలు, కడియం

ప్రకాశం జిల్లా టంగుటూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ రాయవరం గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త. సవలం హనుమాయమ్మను అత్యంత అమానుషంగా ట్రాక్టర్‌తో గుద్ది చంపిన వైసిపి నాయకుడు కొండలరావును కఠినంగా శిక్షించాలని, హనుమాయమ్మ కుటుంబానికి రూ.50 లక్షలు పరిహారం చెల్లించాలని యూనియన్ గౌరవాధ్యక్షులు జువ్వల రాంబాబు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. నిందితుని కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి నష్టపరిహారం అందించాలని నినదించారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ సోమేశ్వరరావుకి వినతి పత్రాన్ని అందించారు. యూనియన్ నాయకులు మేరీ విక్టోరియా మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో మహిళకు రక్షణ లేకుండా పోయిందన్నారు. రాజకీయ వేధింపులు భరించలేక పోతున్నామని విమర్శించారు. సూర్యాకాంతం మాట్లాడుతూ హనుమాయమ్మ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో షేక్ జరీనా బేగం, జల్లూరి రత్నశ్రీ, డి.వెంకటరమణ, విమలకుమారి, పార్వతి, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కడియం దేవీచౌక్ సెంటర్‌లో బుధవారం రాత్రి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.బేబిరాణి ఆధ్వర్యంలో ధర్నా చేశారు. మానవహారం నిర్వహించారు. మరణించిన కార్యకర్త కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. కొండలరావుని వెంటనే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని కోరారు. అంగన్వాడీలపై రాజకీయ జోక్యం ఎక్కువైందన్నారు. కొందరు వైసిపి నాయకులు మితిమీరి ప్రవర్తిస్తూ విధులకు ఆటంకం కలిగిస్తున్నారన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇటువంటి దుర్మార్గమైన ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వై.సుజాత, పి.సుజాత, కె.ఏడుకొండలు, ఎన్.మేరీ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

కడియంలో మానవహారం నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

ఎస్‌సి కమ్యూనిటీ హాల్‌ను అప్పగించాలి

ప్రజాశక్తి - నిడదవోలు

ఎస్‌సి కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన సచివాలయాన్ని తొలగించి వెంటనే కమ్యూనిటీ హాల్‌ను అప్పగించాలని కెవిపిఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ నాయకులు జువ్వల రాంబాబు, పట్టణ నాయకులు డొంకా రమేష్ మాట్లాడారు. దళితులు కోసం 2018లో సుబ్బరాజుపేటలో ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులు రూ.35 లక్షలతో ఎస్‌సి కమ్యూనిటీ హాల్ భవనాన్ని నిర్మించారన్నారు. ఈ భవనంలో వార్డు సచివాలయాన్ని ఏర్పాటు చేశారన్నారు. దీంతో దళితులు సమావేశాలు, శుభకార్యాలను నిర్వహించుకునేందుకు నాలుగేళ్లగా ఇబ్బందులకు గురవుతున్నారనానరు. ప్రభుత్వం సేవలు అందించే వంకతో దళితులకు కేటాయించిన భవనాల్లో సచివాలయం ఏర్పాటు చేయడం తగదన్నారు. తక్షణమే భవనాన్ని దళితులకు అప్పగించాలని, లేకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఎస్‌సి కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన్న సచివాలయం

ఫ్యాప్టో ఆధ్వర్యంలో అదనపు జిల్లా కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలను పరిష్కరించాలంటూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో బుధవారం అదనపు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో రాష్ట్ర చైర్మన్ ఎస్.వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఉపాధ్యాయుల పట్ల పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వైఖరి బాలేదన్నారు. పాఠశాల వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్న జిఒ 117ను వెంటనే రద్దు చేయాలన్నారు. బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలన్నారు. ఉద్యోగోన్నతులు రెగ్యుల్ ప్రాతిపదికన ఇవ్వాలని, సిపిఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు 11వ పిఆర్‌సికి అనుగుణంగా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో అదనపు సెక్రటరీ జనరల్ ఎల్.సాయిశ్రీనివాస్, కో-చైర్మన్లు కె.నరహరి, ఫ్యాప్టో జిల్లా నాయకులు ఎ.షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

కాతేరులో గడప గడపకూ...

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

రాజమహేంద్రవరం రూరల్ కాతేరు గ్రామంలో, సచివాలయం 4 పరిధిలోని సుబ్బారావు పేటలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వైసిపి రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. వీటి అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. పలువురు వారి సమస్యలను చందనకు వివరించారు. ప్రధానంగా తాగునీరు, విద్యుత్ సరఫరా, డ్రెయినేజీ సమస్యలను గుర్తించారు. సంబంధిత అధికారులను పిలిచి తక్షణమే వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. ఆయన వెంట వైసిపి నాయకులు మద్దా దుర్గారావు, పార్ల సురేంద్ర, గంగిపాముల సురేష్, యజ్జు వాసు, ఆచంట కళ్యాణ్, కొత్తపల్లి నాగేశ్వరరావు, నక్కా ధనరాజు, దేవ మాత, కప్పల సూర్యకుమారి, రాజేశ్వరి పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు కృషి చేయాలి

ప్రజాశక్తి - గోపాలపురం

లక్ష్య సాధనకు విద్యార్థులు కృషి చేయాలని ఎంపిపి ఉండవల్లి సత్యనారాయణ, మానవతా సంస్థ జిల్లా చైర్మన్ రామిశెట్టి గంగాధర్ అన్నారు. బుధవారం స్థానికి శార్వాణి స్కూల్ ఆవరణలో మానవతా ఆధ్వర్యంలో మానవతా విద్యానిధి చైర్మన్ అలపాటి నాగేశ్వరరావు తల్లిదండ్రులు అర్జునరావు, కమలావతి దంపతుల జ్ఞాపకార్థం 'ప్రతిభకు మానవతా ప్రోత్సాహం' అనే కార్యక్రమాన్ని మండల చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఇందులో భాగంగా మండల పరిధిలో పదో తరగతిలో విశేష ప్రతిభ కనబర్చిన మండల స్థాయిలోని ప్రథమ, ద్వితీయ, తతీయ స్థానాలను కైవసం చేసుకున్న విద్య కుసుమాలకు, అదే విధంగ మండల పరిధిలోని ప్రతి జడ్‌పి హై స్కూలుకు చెందిన ప్రథమ స్థాయిలో నిలిచిన విద్యార్థులకు నగదు పురస్కారాలను

పురస్కారాలు అందిస్తున్న మానవతా ప్రతినిధులు

ఎంపీపీ మరియు మానవతా స్వచ్ఛందా సేవ సంస్థ ప్రతినిధుల చేతుల మీదుగా అందించారు. 577 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిన జగన్నాథపురానికి చెందిన పప్పుల హర్ష వర్షినికి రూ.10 వేల ప్రోత్సాహక బహుమతి, రాజాంపాలెం హై స్కూలుకు చెందిన ఎం.లేఖన 571, 3వ స్థానంలో నిలిచిన రాజంపాలెం విద్యార్థిని ఎం.రేష్మలక్ష్మీసావిత్రి 560 మార్కులతో తతీయ స్థానం సాధించి రూ.2,500 నగదు ప్రోత్సహకాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలకు అనుగుణంగా చదువుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రయివేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అందిస్తుందన్నారు. మానవతా సంస్థ పేద విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు నిమిత్తం రూ.కోటి నిధిని ఏర్పాటు చేసిందన్నారు. మండలంలోని మిగిలిన 8 పాఠశాలల ప్రథమ శ్రేణిలో నిలిచిన విద్యార్థులకు రూ. 1000 చొప్పున నగదు బహుమతి, మెమోంటోలను అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మానవత నాయకులు కె.రాజ్‌కుమార్, బలుసు సత్యనారాయణ, ప్రభాకర్, వాసు, శ్రీరామ్, రాజు, శర్వాణి ప్రిన్సిపాల్ ఫణికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యాభ్యసనలో తల్లిదండ్రుల పాత్ర కీలకం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

పిల్లల విద్యాభ్యాసనలో ఉపాధ్యాయులతో పాటూ తల్లిదండ్రుల పాత్ర కీలకమని డిఇఒ అబ్రహాం అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో జి20, ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ) అంశంపై జరిగిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. 1 నుంచి 3 తరగతుల విద్యార్థుల్లో బాషాభ్యాసనం, గణిత సామర్థ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. ఆజాదీకా అమత్ మహోత్సవ్‌లో భాగంగా జి20 సదస్సు, జాతీయ విద్యా విధానం 2020, ఎఫ్ ఎల్ ఎన్ కార్యక్రమాల గురించి డైట్ సీనియర్ లెక్చరర్ నూజిళ్ల రామ సుబ్రహ్మణ్యం వివరించారు. విద్యార్థులకు పద్య పఠనం, కథలు చెప్పడం, చిత్రలేఖనంపై పోటీలు నిర్వహించి సర్టిఫికెట్‌లు, బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు ప్రదర్శించిన టిఎల్ఎం మేళాను రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఎమ్.తిరుమల దాస్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఎఎంఒ డి.గౌరీశంకర్‌రావు, సెక్టోరియల్ అధికారులు ఇ.నర్సింహారెడ్డి, కె.శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయు సుజాత, విద్యార్థులు, తల్లిదండ్రులు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో మాట్లాడుతున్న జెసి తేజ్‌భరత్

ఉన్నత శిఖరాలు చేరుకోవాలి : జెసి

ప్రజాశక్తి - తాళ్లపూడి

విద్యార్థి దశ నుంచి ప్రతిభను చాటుతూ ఉన్నత శిఖరాలు చేరుకోవాలని జెసి తేజ్ భరత్ విద్యార్థుళకు సూచించారు. మండల మానవతా శాఖ ఆధ్వర్యంలో తాళ్లపూడిలోని శ్రీ కరిబండి విద్యాసంస్థల ప్రాంగణంలో బుధవారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. దీనికి జెసి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం నిరుద్యోగుల కోసం వికాస పేరుతో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందన్నారు. ఇటువంటి జాబ్‌మేళాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. మానవతా సంస్థ స్వచ్ఛంద సేవా కార్యక్రమాలతో పాటు ఇటువంటి జాబ్ మేళాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కళాశాల డైరెక్టర్ త్రినాథస్వామి మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉపాధి కల్పించేలా మానవతా సేవా సంస్థ నిర్వహించిన జాబ్ మేళాకు తమ కళాశాల వేదిక కావడం ఆనందంగా ఉందన్నారు. మానవతా సేవా సంస్థ అధ్యక్షులు జోడాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తమ శాఖ నిర్వహించిన ఈ జాబ్ మేళాకు 612 మంది నిరుద్యోగులు హాజరుకాగా 304 మంది ఉద్యోగాలు సాధించారన్నారు. ఈ మేరకు ఆయనా కంపెనీల ప్రతినిధులు నియామక పత్రాలను అందించాయన్నారు. ఈ కార్యక్రమంలో మానవతా శాఖ గౌరవాధ్యక్షులు సింహాద్రి జనార్ధనరావు, తహశీల్దార్ రాధిక, కరిబండి విద్యాసంస్థల వ్యవస్థాపక కరస్పాండెంట్ కరిబండి గనిరాజు మానవతా డైరెక్టర్ గోకవరపు బాబులు, మాజీ అధ్యక్షుడు అప్పన చంద్రధర గుప్త, సభ్యులు సుబ్బారావు, వికాస పీడీ రమేష్ వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు ఉండ్రాజవరంలో అన్న సమారాధ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఉండ్రాజవరంలో నూతనంగా నిర్మించిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో నేడు విగ్రహ ప్రతిష్టాపన, అనంతరం అన్నదానం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ద్వారపాలక, గరుడ, ఆలయ విమాన శిఖర, జీవ, ధ్వజస్తంభ విగ్రహ ప్రతిష్టాపన జరుగుతుందన్నారు.

సీతానగరానికి సిహెచ్‌సి

సీతానగరం : నియోజకవర్గంలోని సీతానగరం మండల ప్రజానీకానికి మరింత మెరుగైన వైద్య సేవలు అందించడంలో భాగంగా ప్రస్తుతమున్న పిహెచ్‌సిని 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సిహెచ్ సి)గా అప్ గ్రేడ్ చేయడానికి బుధవారం జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో ఆమోదం లభించింది. ఈ సిహెచ్‌సికి 23 పోస్టులు మంజూరయ్యాయి. స్థానిక ఎంఎల్ఎ జక్కంపూడి రాజా ప్రతిపాదనలతో సిహెచ్‌సి ఏర్పాటైందని వైసిపి నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రఘుదేవపురంలో అత్యాధునిక సౌకర్యాలతో ఆసుపత్రి భవనం నిర్మించనున్నారు. దీనికి తోడు సీతానగరం మండల ప్రజలకు మరింతగా వైద్య సేవలు అందించడంలో భాగంగా బొబ్బిలంక గ్రామంలో మరో పిహెచ్ నెలకొల్పనున్నారు.

జలకాలాటలలో...

తాళ్లపూడి : ఎండలు మండుతుండటంతో సేదతీరేందుకు ప్రజలు ప్రత్యామ్నాయాలను వెతుక్కుంటున్నారు. ఇందులో భాగంగా వేగేశ్వరపురం ఎత్తిపోతల పంప్ హౌస్ వద్దకు జనం పోతెత్తారు. వేగేశ్వరపురం ఎత్తిపోతల పథకం కాలువ తక్కువ లోతులో స్విమ్మింగ్ పూల్‌ని తలపించినట్టు ఉండటంతో యువత సాయంత్రం వేళ ఇక్కడికి క్యూ కడుతున్నారు. కాలువలో జలకాలాడుతూ వేసవి నుంచి ఉపశమనం పొందుతున్నారు. రెండు రోజులుగా ఎండలు మండుతుండటంతో కాలువకు యువత పోటెత్తింది.

కొనసాగుతున్న వేసవి శిబిరాలు

చాగల్లు : చాగల్లు, చంద్రవరం శాఖ గ్రంథాలయాల్లో వేసవి శిబిరాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం విద్యార్థులతో స్టోరీ టెల్లింగ్, స్టోరీ రీడింగ్ చేయించారు. మదర్ థెరిసా జీవిత విశేషాలను చదివించారు. వార్డు సభ్యులు మద్దిపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ మదర్ థెరిసా ప్రపంచానికి తల్లి లాంటిదన్నారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు గ్రంథాలయాలను తప్పనిసరిగా సందర్శించాలని తెలిపారు. అనంతరం విద్యార్థులకు స్నాక్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.సుమన్‌కుమార్, రిసోర్స్ పర్సన్స్ ఎన్.గౌతమ్, వి.మణికంఠ, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ప్రతిభా పురస్కారాల అందజేత

ఉండ్రాజవరం : మండలంలో ఈ ఏడాది పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మొదటి స్థానం సాధించిన విద్యార్థులకు నేడు ప్రతిభా పురస్కారాలు అందిస్తామని యుటిఎఫ్ ఉండ్రాజవరం మండల శాఖ అధ్యక్షులు కె.వెంకటరత్నం బుధవారం తెలిపారు. మండలంలోని ఎనిమిది ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులలో అత్యధిక మార్కులతో మొదటి స్థానం సాధించిన విద్యార్థులకు వీటిని అందిస్తామని తలెఇపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పి.జయకర్ హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ ఐ.రాంబాబు, ఉండ్రాజవరం మండలం శాఖ సెక్రటరీ దువ్వాపు రామారావు, శాఖా సభ్యులు పాల్గొన్నారు.

హెల్పర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - గోపాలపురం, గోకవరం

గోపాలపురం ఐసిడిఎస్ పరిధిలోని అంగన్‌వాడీ హెల్పర్ల పోస్టులకు అర్హత గలవారు దరఖాస్తు చేసుకోవాలని సిడిపిఒ వైబిటి.సుందరి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల మండలాల్లో ఖాళీగా ఉన్న హెల్పర్ పోస్టులను భర్తీ చేయనున్నామని తెలిపారు. సాగిపాడు (బిసి-బి), గుడ్డిగూడెం(బిసి-డి), త్యాజంపూడి(ఓపెన్), యర్నగూడెం(ఎస్‌సి), నల్లజర్ల(ఎస్‌సి), నల్లజర్ల(ఓపెన్), ఆవపాడు(బిసి-ఎ) కేటగిరీల వారీగా పోస్టులను భర్తీ చేస్తామన్నారు. స్థానిక వివాహిత మహిళలై ఉండాలన్నారు. 21 నుంచి 35 ఏళ్లలోపు వయస్సు కలిగి పదో తరగతి పాసై ఉండాలన్నారు. వికలాంగులైతే తక్కువ పర్సంటేజ్ ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. 13లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కోరుకొండ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని గోకవరం మండలంలో ఖాళీ అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాని సిడిపిఒ జె.ఝాన్సీరాణి తెలిపారు. గుమ్మళ్ల దొడ్డి1లో(బిసి-ఇ), గంగంపాలెం 1లో(ఒసి జనరల్), జగన్నాథపురలో (బిసి-ఎ), బావాజీపేటలో(ఒసి జనరల్)కు కేటాయించారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 13లోగా కోరుకొండ ఐసిడిఎస్ కార్యాలయంలో దరఖాస్తులు అందించాలన్నారు.

పేరుకుపోయిన చెత్త

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని తాడిపర్రులో రోడ్లపై చెత్త పేరుకుపోయింది. దీని వల్ల అపరిశుభ్ర వాతావరణం నెలకొందని స్థానికులు వాపోతున్నారు. దుర్వాసనతో అల్లాడుతున్నామన్నారు. పారిశుధ్య సిబ్బంది చెత్తకు నిప్పు పెట్టడంతో పొక కమ్మేస్తుందన్నారు ఈ పొగతో తమ ఆరోగ్యాలు పాడవుతున్నాయని వాపోతున్నారు. పాలకులు, ప్రభుత్వం తమ గోడు పట్టించుకుని తమ ఆరోగ్యాలకు రక్షణ కల్పించాలని వేడుకుంటున్నారు. అసలే రానున్నది వర్షాకాలం కావడంతో చెత్త కుళ్లిపోయి దుర్వాసనతో పాటు దోమలు, ఈగలకు ఆవాసాలుగా మారే ప్రమాదం ఉందని

హెచ్చరిక బోర్డు చుట్టూ పేరుకుపోయిన చెత్త

తెలిపారు. అంటువ్యాధులు కూడా ప్రబలే అవకాశం ఉందన్నారు. ఈ విషయమై సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు వివరణ కోరగా ప్రభుత్వానికి స్పందన ద్వారా అనేకమార్లు దీనిపై వినతిపత్రాలు అందించామన్నారు. డంపింగ్ యార్డ్ నిర్మాణం కోసం అర్ధనగ్న ప్రదర్శన సైతం నిర్వహించినా అధికారుల్లో స్పందన కరువైందన్నారు. కార్యదర్శి పి సత్యనారాయణ మాట్లాడుతూ తప్పనిసరిగా నెలకు మూడు, నాలుగు సార్లు ప్రత్యేక యంత్ర పరికరాలతో చెత్తను శుభ్రం చేయిస్తున్నామన్నారు. డంపింగ్ యార్డ్ నిర్మాణం జరిగితే సమస్య పూర్తిగా పరిష్కారం అవుతుందన్నారు.

నిప్పుపెట్టడంతో వస్తున్న రోడ్డుపైకి వస్తున్న పొగ

కార్టూ'నిజం'

నేరాలు ఘోరాలు

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గోకవరం

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో వైద్యం పొందుతూ మృతి చెందిన సంఘటన గుమ్మళ్ళదొడ్డిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం దేవరపల్లి గ్రామానికి చెందిన గంగరాజు వీర్రాజు (55) జీవనోపాధి కోసం గోకవరం మండలం గుమ్మళ్ళదొడ్డిలోని హెచ్‌పిసిఎల్ గ్యాస్ కంపెనీలో లారీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 6న మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకి వెళ్లి తిరిగి రాత్రి 7 గంటల సమయంలో కోరుకొండ నుంచి గుమ్మళ్ళదొడ్డి వస్తున్నాడు. గుమ్మళ్ళ దొడ్డి జంక్షన్ వద్ద ఆవులు మంద అడ్డు రావడంతో బైక్ అదుపు చేసుకోలేక బండిపోతూ కిందపడిపోయి గాయపడ్డాడు. అతడిని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు గోకవరం హెడ్ కానిస్టేబుల్ భాస్కరరావు తెలిపారు.

మోసగించిన వ్యక్తికి రిమాండ్

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

స్థానిక గాంధీ నగర్ ప్రాంతానికి చెందిన గుర్రాల భారతమాతను నమ్మించి మోసం చేసిన కేసులో వీరేటి సత్యనారాయణకు కాకినాడ మెజిస్ట్రేట్ 14 రోజులపాటు రిమాండ్ విధించారు. స్థానిక సిఐ కె.దుర్గాప్రసాద్ అందించిన వివరాలు ప్రకారం భరతమాతకు సత్యనారాయణ మాయమాటలు చెప్పి నమ్మించి మోసం చేశాడు. ఆమెకు చెందిన ఒక ఇల్లు అమ్మి సొమ్మును ఇవ్వలేదు. దీంతో బాధితురాలి ఫిర్యాదుపై సత్యనారాయణను అరెస్టు చేసి కాకినాడ కోర్టుకు అప్పగించినట్లు తెలిపారు. కాకినాడ కోర్టు సత్యనారాయణకు ఈ నెల 20వ తేదీ వరకు రిమాండ్ విధించినట్లు సిఐ దుర్గాప్రసాద్ చెప్పారు.

అస్వస్థతకు లోనై మత్స్యకారుడు మరణం

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని కోరంగి పంచాయతీ బొడ్డు చిన్న వెంకటయ్యపాలెం గ్రామానికి చెందిన మత్స్యకారుడు కొపనాతి గోవరాజు (32) బుధవారం మరణించినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. బయటికి వెళ్లి వచ్చిన గోవరాజు ఇంటికి వచ్చి కళ్లు తిరిగి పడిపోయాడు. అపస్మారక స్థితిలో ఉండడంతో తాళ్లరేవు సిహెచ్‌సికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ జిజిహెచ్‌కు తరలించగా ఆసుపత్రికి చేరేలోపే మరణించినట్టు వైద్యులు పేర్కొన్నారు. గోవరాజుకు భార్య ఆదిలక్ష్మి, ఇద్దరు సంతానం కలరు.

ఉపాధికి కోసం వెళ్లి..

ప్రజాశక్తి-కాజులూరు

ఉపాధి కోసం వెళితే పిడుగు పడి కుటుంబ పెద్ద మరణించడంతో ఆ కుటుబం శోకంటో మునిగిపోయింది. మండలంలోని ఉప్పుమిల్లి గ్రామం నుండి ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండలం సోంపల్లిలో ఇటుక బట్టీలో పని చేయడానికి వారం రోజుల క్రితం 35 మంది కూలీలు వెళ్లారు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం ఒక్కసారిగా వర్షం పడడంతో పిడుగులు పడ్డాయి. సమీపంలో తలదాచుకుంటున్న బుంగా సూర్యనారాయణ (64)పై పిడుగు పడటంతో అక్కడికక్కడే మతి చెందాడని కుమారుడు శ్రీనివాస్ తెలిపారు. సూర్యనారాయణకు భార్య ఇద్దరు కుమారులు ముగ్గురు కుమారులు ఉన్నారు. సూర్యనారాయణ వారం క్రితమే అందరినీ పలకరించి వెళ్లాడు.

రోడ్డు ప్రమాదంలో కూలీ మృత్యువాత

ప్రజాశక్తి - ఆలమూరు

216ఏ జాతీయరహదారిపై చొప్పెల్ల లాకుల సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కూలీ మృతి చెందాడు. మండలంలోని నర్సిపూడికి చెందిన పీతల పుత్రయ్య(40) కూలి పనుల నిమిత్తం మూలస్థానం వెళ్లాడు. మంగళవారం రాత్రి బైక్‌పై స్వగ్రామం చేరుకునే క్రమంలో చొప్పెల్ల లాకుల వద్ద జాతీయ రహదారి డివైడర్ దాటుతున్నాడు. రాజమహేంద్రవరం వైపు నుండి రావులపాలెం వైపుకు వెళుతున్న కారు బైక్ ను ఢీకొని వెళ్లిపోయింది. ఈ ఘటనలో పుత్రయ్య తీవ్రంగా గాయపడగా 108 అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి స్థానికులు తరలించారు. అప్పటికే పుత్రయ్య మతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు మతుని కుమారుడు సునీల్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి, ప్రమాదానికి కారణమైన కారును గుర్తించి, డ్రైవర్‌ను అదుపులోకి తీసున్నట్టు పోలీసులు తెలిపారు.

చోరీ కేసులో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-చాగల్లు

మండలంలోని మల్లవరంలో దొంగతనాలకు సంబంధించి ఇద్దరు నిందితులను బుధవారం అరెస్ట్ చేసి న్యాయస్థానం ముందు హాజరు పరిచినట్టు ఎస్ఐ సిహెచ్.రమేష్ తెలిపారు. ఈ దొంగతనానికి సంబంధించి గత నెల 13న మల్లవరానికి చెందిన లకంసాని శ్రీనివాసరావు ఇంటిలో ఉన్నటువంటి 8 కాసుల బంగారం, కేజీ వెండి అపహరించారు. ఈ కేసులో నిందితులను గుర్తించి వారి వద్ద నుంచి సొత్తు రికవరీ చేసినట్టు ఎస్ఐ తెలిపారు.



బెల్లపు ఊట ను ధ్వంసం చేస్తున్న సిబ్బంది

100 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఎస్ఇబి సిఐ కె.వి స్వామి ఆధ్వర్యంలో సిబ్బంది సారా బట్టీలపై నిర్వహించిన దాడుల్లో 100 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ వై.నాగేంద్ర కృష్ణ తెలిపారు. దీనికి సంబంధించి ఒక వ్యక్తి పై కేసు నమోదు చేశామన్నారు.

అరకొరగానే రేషన్ కందిపప్పు

- పూర్తిస్థాయిలో షాపులకు చేరలేదు
- మార్కెట్‌లో కిలో రూ.150 పైమాటే
- రేషన్‌లో ప్రతినెలా తప్పని కోతలు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

బయట మార్కెట్లో నిత్యావసరాల సరుకుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. ముఖ్యంగా ప్రజలు నిత్యం వాడే కందిపప్పు ధర రూ.150 ఉంది. ఈ నేపథ్యంలో రేషన్ షాపుల ద్వారా రాయితీ పప్పు అందించాల్సిన ప్రభుత్వం అరకొర సరఫరాకే పరిమితమైంది. రాయితీ పోను కిలో కందిపప్పు రూ.67కే లభిస్తున్నందున రేషన్ షాపుల ద్వారా పప్పు పంపిణీ చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. జిల్లాలో 6,45,811 బియ్యం కార్డులుండగా 1,060 రేషన్ షాపుల పరిధిలో 420 ఎండియు వాహనాల ద్వారా నెలనెలా బియ్యం,కందిపప్పు, పంచదార పంపిణీ జరుగుతుంది. ఒక్కో లబ్ధిదారునికి కిలో కందిపప్పు ఇస్తుండగా ఈ లెక్కన సుమారు 600 మెట్రిక్ టన్నులు అవసరం ఉంది. జూన్ నెలలో పంపిణీకి కేవలం 130 టన్నులే ఉందని అధికారులు తెలిపారు. మిగిలిన కందిపప్పు ఎప్పుడు వస్తుందనేది స్పష్టత లేదు. ఈ నేపథ్యంలో కొందరు లబ్ధిదారులకు మాత్రమే ఈనెలలో అందే పరిస్థితి కనిపిస్తోంది. ఈ నెలే కాకుండా ప్రతినెల కందిపప్పు పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు అందడం లేదు. గత నెలలో కేవలం 266.52 మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చింది. ఇలా కందిపప్పు సరఫరాలో కోత విధిస్తున్నారు. ప్రతినెల షాపుల ద్వారా ఇస్తున్న సరుకుల్లో ఏదో దానిలో కోత పెడుతుండడంతో లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు. బియ్యం, పంచదార మెజార్టీ లబ్ధిదారులకు అందుతుండగా కందిపప్పు మాత్రం నాలుగో వంతు లబ్ధిదారులకు కూడా అందడం లేదు. కాకినాడ నగరంలో 116 షాపులుండగా కేవలం రెండు షాపులకు మాత్రమే కందిపప్పు సరఫరా అయింది. ఇలా అతి కొద్ది షాపులకు మాత్రమే సరఫరా జరిగింది. ఈ నెల 1 నుంచి సరుకులను ఎండియు వాహనాల ద్వారా అందిస్తుండగా కందిపప్పుకు కోత వేయడంతో లబ్ధిదారులు ఆపరేటర్లను ప్రశ్నిస్తున్నారు.

పూర్తిస్థాయి లబ్ధిదారులకు అందని సరుకులు

జిల్లాలో 6.45 లక్షల రేషన్ కార్డులుండగా ప్రతినెల 10 శాతం మంది లబ్ధిదారులకు సరుకులు అందని పరిస్థితి నెలకొంది. టెక్నికల్ సమస్యలతో పాటు పర్యవేక్షణ లోపం, సకాలంలో సరుకులు అందక, అన్ని ప్రాంతాలకు ఎండియు వాహనాలు వెళ్లకపోవడం వంటి పలు కారణాల వల్ల జిల్లావ్యాప్తంగా సుమారు 60 వేల మందికి పైనే లబ్ధిదారులకు సరుకులు చేరడం లేదు. గతనెలలో 5.83 లక్షల మందికి మాత్రమే సరుకులు అందాయి. 61 వేల మందికి కోత పడింది.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- కరప

మండలం వేలంగి గ్రామంలో 150 సంవత్సరాల చరిత్ర ఉన్న గ్రామ దేవత మారమ్మ తల్లి నూతన దేవాలయ నిర్మాణానికి బుధవారం ముత్యాల శ్రీను బాబు దంపతులు భూమి పూజ చేశారు. సర్పంచ్ సవిలే నీలిమ రాజేష్ దంపతులు ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు కార్యక్రమం నిర్వహించారు. ఈ ఆలయ నిర్మాణానికి కాకినాడ రూరల్ ఎంఎల్ఎ కురసాల కన్నబాబు రూ.10 లక్షల నిధులను మంజూరు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బొండా వెంకన్న రావు, గరగ జెమ్మి, కుళ్ల వెంకట్రావు, మెర్ల వీరయ్య చౌదరి, గరగ అప్పారావు, జీలకర్ర దుర్గారావు కుంచే అయ్యన్న, కొప్పిశెట్టి మంగయ్య , పాతూరి వీరన్న చౌదరి, గణేశ్వరరావు, సాన శ్రీను, ఆలయ గ్రామ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంఎల్ఎ 'దొమ్మేటి'కి నివాళి

ప్రజాశక్తి -కరప

మాజీ ఎంఎల్ఎ దొమ్మేటి వెంకటేశ్వర్లుకు పలువురు ఘనంగా నివాళులర్పించారు. కరప చిరంజీవి కళ్యాణ మండపంలో బుధవారం దొమ్మేటి వెంకటేశ్వర్లు సంతాప సభ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బిసి సంఘ నాయకులు దొమ్మేటి చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాజులూరు మండలం దుగ్గుదుర్రుకు చెందిన దొమ్మేటి సేవా తత్పరుడిగా తాళ్లరేవు నియోజకవర్గంలో మంచి పేరు ప్రతిష్టలు సంపాదించుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయుడు చంటి, రాయుడు శ్రీను, జానకి రామయ్య, రామారావు, పిపాని సత్తిబాబు, అల్లు శివ, తదితర నాయకులు పాల్గొన్నారు.

దొమ్మేటికి సంతాపం తెలియజేస్తున్న నాయకులు

వరుపుల సత్యప్రభకు ఘన స్వాగతం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ప్రత్తిపాడు టిడిపి ఇన్‌ఛార్జిగా బాధ్యతలు చేపట్టిన వరుపుల రాజా సతీమణి వరుపుల సత్య ప్రభకు ఏలేశ్వరం మండలంలో బుధవారం ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఆమె బుధవారం మండలంలోని జె.అన్నవరం, తూర్పు లక్ష్మీపురం రమణయ్యపేట గ్రామాల్లో పర్యటించారు. తొలుత ఆమె జె.అన్నవరంలో అంబేద్కర్, ఎన్‌టి రామారావు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్యప్రభ మాట్లాడుతూ రాజా ఆశయాలకు అనుగుణంగా నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పనిచేస్తానన్నారు. సంక్షేమ పాలన చంద్రబాబుతోనే సాధ్యమని చెప్పారు. ఆమె వెంట పార్టీ నాయకులు సూతి బూరయ్య, మూది నారాయణస్వామి, మండపాక అలక్ రాజు, బొరుసు శ్రీనివాస చక్రవర్తి, కన్నారావు, బస ప్రసాద్, జిగటాపు సూరిబాబు, బెల్లాన్ని శ్రీను, పెంటకోట శ్రీధర్, ఈశ్వరరావు ఉన్నారు.

ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న సత్యప్రభ

వ్యవసాయ రుణాలపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం మండలంలోని టేకి రైతు భరోసా కేంద్రం వద్ద డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్ గా ప్రవేశ పెట్ట నున్న వ్యవసాయ నిపుణులు కు అందించు రుణాలపై బుధవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కెవిఎన్.రమేష్ కుమార్, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాస్, సొసైటీ ఛైర్మన్ మట్టపర్తి పాల్ రాజు, డిసిసిబి బ్యాంక్ మేనేజర్ దేవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎఒ రమేష్ కుమార్ మాట్లాడుతూ కౌలు రైతులకు వ్యవసాయ నిపుణులుగా వ్యవసాయేతర రుణాలు ఇవ్వడం పై పైలెట్ ప్రాజెక్టుగా టేకి గ్రామాన్ని ఎంపిక చేశామని అన్నారు. ముఖ్య ంగా ఈ గ్రామంలో భూమి, కౌలు రైతులు ఎక్కువగా ఉండడంవల్ల గుర్తించామని అన్నారు. గత 5 సంవత్సరా లుగా వ్యవసాయం చేస్తూ బ్యాంకుల నుంచి ఎటువంటి రుణం పొందని కౌలు రైతులను గుర్తించి వీరు భూమి సాగు చేస్తున్నారని అన్నారు. ఫీల్డ్ ఎంక్లయిరీ చేసి ధ్రువీకరించామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు గంజా హరిబాబు, విఆర్ఒలు మల్లేష్ జాన్, రైతులు పాల్గొన్నారు.

టేకి సమావేశంలో మాట్లాడుతున్న ఎఒ రమేష్ కుమార్

ఆటోలతో ప్రయాణికులకు ఇక్కట్లు

ప్రజాశక్తి-మండపేట

పట్టణంలోని రద్దీగా ఉండే కలువ పువ్వు సెంటర్ లో కపిలేశ్వరపురం రోడ్డులో ఆటోలు రోడ్డుకు అడ్డంగా నిలిపి వేస్తున్నడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు. మెయిన్ రోడ్డుకు ఎడమవైపున సగభాగంలో ఆటోలు పెడుతుండడంతో ఎదురుగా వచ్చే వాహనాలతో పాటు ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేవలం పోలీసులు సెంటర్లో విధులు నిర్వహిస్తున్నప్పుడు తప్ప మిగిలిన అన్ని సమయాల్లో ఇదేవిధంగా ఆటోలు నిలిపివేసి ట్రాఫిక్ కి అంతరాయం కలిగిస్తున్నారని పలువురు ప్రయాణికులు అంటున్నారు. ఇదే విషయాన్ని అనేక మార్లు అధికారుల దష్టికి తీసుకువెళ్లిన సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడం లేదని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

రోడ్డుకు అడ్డంగా పార్క్ చేసిన ఆటోలు

టిడిపి మ్యానిఫెస్టోతో వైసిపి నేతల గుండెల్లో రైళ్లు

ప్రజాశక్తి - అంబాజీపేట

భవిష్యత్తు గ్యారం టీ పేరుతో టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు విడుదల చేసిన మ్యానిఫెస్టోతో వైసిపి నేతల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని మాజీ జెడ్‌పి ఛైర్మన్ నామన రాంబాబు అన్నారు. మండల టిడిపి ప్రధాన కార్యదర్శి గుడాల ఫణి ఆధ్వర్యంలో అంబాజీపేటలో ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద బుధవారం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. అనంతరం మాజీ ఎంపిపి దాసరి వీర వెంకట సత్యనారాయణ, మాజీ జెడ్‌పిటిసి సభ్యుడు బొంతు పెదబాబు ల పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. వారిద్దరిని సత్కరించి కేక్ కట్ చేయించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు వక్కలంక బుల్లియ్య, రాష్ట్ర నాయకులు డొక్కా నాథ్ బాబు, అరిగెల బలరామమూర్తి, గణపతి వీర రా ఘవులు, చిన్నం బాల విజయారావు, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, మట్టపర్తి భారతి, మందపాటి అనితా కిరణ్, పెదపూడి శ్రీను, మందా రాజేష్, ఎ.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నేతలు

తాపేశ్వరం - ద్వారపూడి రోడ్డు నిర్మాణం పూర్తిచేయాలి

ప్రజాశక్తి-మండపేట

నరకానికి మరో రూపంగా ఉన్న తాపేశ్వరం - ద్వారపూడి రోడ్డుకు మోక్షం ఎప్పుడని ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు ప్రశ్నించారు. బుధవారం టిడిపి నాయకులతో కలిసి ఆయన సెల్ఫీ ఛాలెంజ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అట్టహాసంగా పనులు ప్రారంభించి సగంలో వదిలేసిన రోడ్డు నిర్మాణం వెంటనే పూర్తిచేసి ప్రజల కష్టాలు తీర్చాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు ముత్యాల పట్టాభి, నూనె వీర్రాజు, గోసాల సుజాత ప్రసాద్, విత్తనాల గౌరీ శ్రీనివాస్, వేగుళ్ల శివరామకృష్ణ, చుక్కాన సుబ్బరాజు, టిడిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ద్వారపూడి రోడ్డుపై ఎంఎల్ఎ సెల్ఫీఛాలెంజ్

ఫ్లైవర్ బ్రిడ్జి పనులను సమీక్షిస్తున్న ఎంపీ భరత్‌రామ్

ఫ్లయ్ ఓవర్ పనుల్లో జాప్యం వద్దు

కాంట్రాక్టర్ సురేష్ గౌడ్‌తో ఎంపీ భరత్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

మోరంపూడి జంక్షన్ వద్ద నిర్మిస్తున్న ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండటం పట్ల ఎంపీ భరత్ రామ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. జాప్యం తగదని కాంట్రాక్టర్ సురేష్ గౌడ్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం ఈ పనులను ఎంపీ పరిశీలించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్ సురేష్ గౌడ్‌తో మాట్లాడారు. బ్రిడ్జి నిర్మాణ పనుల్లో వేగం కనబడటం లేదన్నారు. బ్రిడ్జి పనుల్లో భాగంగా నిర్మిస్తున్న కల్వర్టు పనులను పరిశీలించారు. పనుల్లో ప్రతివారం పురోగతిని చూపించాలని ఆదేశించారు. ప్రతీ వారం తప్పనిసరిగా పనులు సమీక్షిస్తానన్నారు. పిల్లర్స్ 18 మీటర్ల కిందకు అంటే 60 అడుగుల లోతు వరకూ నిర్మాణ పనులు పూర్తయ్యాయని, ఈ నెలాఖరు నాటికి పిల్లర్స్ పూర్తి అవుతాయని కాంట్రాక్టర్ తెలిపారు. ఎంపీ వెంట ఎన్‌హెచ్ఎఐ మేనేజర్ సాల్మన్ అన్సారీ, సైట్ ఇంజినీర్ సాయి నాథ్, నగర పార్టీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, నగర మహిళా అధ్యక్షులు మార్తి లక్ష్మి, సంకిస భవానీప్రియ, కడలి వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

పెదగాడవిల్లి కి చెందిన శతాధిక వృద్ధురాలు నూకల నారాయణ రత్నం (107)బుధవారం వయోభారంతో మృతి చెందారు. ఆమెకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.14 మంది మనుమలు, మనుమరాళ్లు, 13 మంది మునిమనములు ఉన్నారు. శతాధిక వృద్ధురాలు నారాయణ రత్నం మృతిపట్ల గ్రామస్తులు విచారం వ్యక్తం చేశారు.

నారాయణరత్నం(ఫైల్)

కాలువలో తూడు తొలగింపు

ప్రజాశక్తి-మండపేట

గత కొద్దిరోజుల నుంచి మండలంలోని 12 గ్రామ పంచాయతీలలో ఉపాధి హామీ పనులు జరుగుతుండగా మేజర్ పంచాయతీలు ఏడిద, ద్వారపూడి, కేశవరం, ఇప్పనపాడు గ్రామాలలో చెరువు పూడికతీత పనులు మిగిలిన పంచాయతీల్లో ఫీల్డ్ కెనాల్ పనులు జరుగుతున్నాయి. మండలంలోని ద్వారపూడి శివారు చిన్న ద్వారపూడిలోని పంట కాలువలో ఉపాధి కూలీలు నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా తూడు, పిచ్చి మొక్కల తొలగింపు పనులు చేస్తున్నారు. కూలీల హాజరుకు సంబంధించి రెండో ఫొటో కోసం గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తుందని పలువురు కూలీలు వాపోతున్నారు.

పనులు చేస్తున్నకూలీలు

యానాం వార్తలు

అన్నదానంలో పాల్గొన్న ఎంఎల్ఎ అశోక్

వినాయక విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి - యానాం

యానాం పరిధిలోని జి ఎన్ నాయుడు కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి ఆలయంలో స్వామి వారి ప్రతిష్టాపన ఘనంగా నిర్వహించారు. జరిగింది.బుధవారం ఆలయ కమిటీ,భక్తులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పాల్గొని ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు.ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అన్న సమారాధన ను ఎమ్మెల్యే ప్రారంభించారు.అనంతరం కొంతసేపు ప్రజలకు వడ్డన చేశారు. ముందుగా ప్రతిష్ట సందర్భంగా వేద పండితులు పలు పూజా కార్యక్రమాలు ఘనంగా జరిపించారు.

నేడు మత్స్యకారులకు పించన్ల పంపిణీ

ప్రజాశక్తి -యానాం

పుదుచ్చేరి మత్స్యశాఖ ద్వారా కొత్తగా మంజూరైన 252 మంది మత్స్యకారులకు గురువారం ఉదయం ఫించన్లు పంపిణీ చేయనున్నట్టు ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. స్థానిక మత్స్యశాఖ కార్యాలయంలో ఈ పించన్ల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

'టిడిపితోనే సంక్షేమం, అభివృద్ధి'

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

టిడిపితోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని టిడిపి రాష్ట్ర నాయకుడు ఆదిరెడ్డి శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం కాకినాడ సిటీ మాజీ ఎంఎల్ఎ కొండబాబు కాకినాడ సిటీ విస్తత స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అథితిగా ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) హాజరై మాట్లాడారు.. మహానాడు వేదికగా రాష్ట్రంలోని ప్రజలకు వరాల రూపంలో తెలుగుదేశం ప్రవేశపెట్టిన పథకాలు పేదవారిని ధనికులను చేయడానికి సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిటీ ప్రెసిడెంట్ మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్, ఒమ్మి బాలాజీ, కలగా శివరాణి, చిక్కాల సత్యవతి, గదుల సాయి బాబా, సికోటి అప్పలకొండ, కరీం, ఎండీ ఆన్సర్ మాజీ కార్పొరేటర్లు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, మహిళలు, యువత పాల్గొన్నారు.

నాడు-నేడు పనులపై కమిషనర్ సమీక్ష

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కార్పొరేషన్ పరిధిలోని నగరపాలక సంస్థ ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన నాడు నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్ రావిరాల ఆదేశించారు. బుధవారం స్మార్ట్ సిటీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో నాడు నేడు పనులపై పాఠశాల ఇంజనీరింగ్ విభాగ అధికారులతో ఆయన సమీక్షించారు.

IN THE COURT OF HONOURABLE VI ADDL JUNIOR CIVIL JUDGE AT RAJAMAHENDRAVARAM
O.S.No. 371/2022

Between:
State Bank of India, RASMECCC & SARC, Danavaipeta, Rajahmundry, Rep. by. its Manager.
...Plaintiff
VS
Bommanamaina Gandi Raju
...Defendant
SUMMONS

To: Bommanamaina Gandi Raju, S/o. Muttayya, D.No. 47-2-1, Y.Junction, Beside S.K.V.T. College, Gandhi puram, Rajahmundry.

Please take notice that the above plaintiff filed the suit against you for recovery of an amount **Rs.1,05,232/-** together with subsequent interest and other reliefs. The above suit stand posted to **22-06-2023 for your appearance either in person or through a pleader on the above mentioned date in the said court at 10:30 A.M** to answer the claim, failing which the matter will be disposed off as per law.

KANDUKURI SRINIVAS
SBI Panel Advocate,
Rajamahendravaram.
Cell: 90595 49017

IN THE COURT OF HONOURABLE Ist ADDL JUNIOR CIVIL JUDGE AT RAJAMAHENDRAVARAM
O.S.No. 975 /2022

Between:
State Bank of India, Lalachervu Branch, Rajahmundry Rep. by its Branch Manager.
...Plaintiff
VS
Krishna Kumara Lingam
...Defendant
SUMMONS

To: Krishna Kumar Lingam, S/o. Trimurthulu, D.No.13-7-23, 1st Street, Kotilingalapeta, Rajahmundry.

Please take notice that the above plaintiff filed the suit against you for recovery of an amount **Rs.5,29,887/-** together with subsequent interest and other reliefs. The above suit stand posted to **16-06-2023 for your appearance either in person or through a pleader on the above mentioned date in the said court at 10:30 A.M** to answer the claim, failing which the matter will be disposed off as per law.

KANDUKURI SRINIVAS
SBI Panel Advocate,
Rajamahendravaram.
Cell: 90595 49017

సవరణ

సమయమంతుల సూర్యనారాయణమూర్తి గారు ది. 28-5-2023వ తేదీన ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండు పేపర్లు పోయినవి అని ఇచ్చిన ప్రకటనలో ది. కాకినాడ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ నెం. 8979, కాకినాడ (బ్యాంకు) కు బదులుగా **ది. కాకినాడ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ నెం. 8979,** కాకినాడ గా చదువుకొనగలరు.

సమయమంతుల సూర్యనారాయణమూర్తి
S/o. (లేటు) సత్యనారాయణ
డోర్ నెం. 15-5-12, గాబువారి వీధి,
రామకృష్ణారావుపేట, కాకినాడ
సెల్: 92937 26849

ప్రకటన

మా క్లయింటు రాజమహేంద్రవరం రూరల్ మండలం, ధవళేశ్వరం, సాయినగర్, కాటన్‌పేట, డోరు నెం. 18-123/3=13-202, నూని ధనరాజు గారి భార్య నూని సుబ్బలక్ష్మి గారు మాకు ఇచ్చిన సంజాయిషిపై తెలియజేయునదేమనగా,

మా క్లయింటు రాజమహేంద్రవరం రూరల్ మండలం ధవళేశ్వరం, సాయి నగర్, కాటన్‌పేట డోరునెం. 18-123/3=13-202, అర్.ఎస్. నెం. 125/2, ప్లాట్ నెం. 8 లో 252 చ.గ.లులో గల డాబా యిల్లును ది. 16-05-1991 క్రయదస్తావేజు నెం. 3323/1991 రీత్యా అక్కిన శేషగిరిరావు వగైరాలు నుండి కొనుగోలు చేసిన ఆస్తి అయివున్నది. సదరు 16-05-1991 క్రయదస్తావేజు నెం. 3323/1991 వారు వారి ఇంటి వద్ద నుండి ధవళేశ్వరం మెయిన్ రోడ్డు నుండి జిరాక్సు తీసుకొని వెళ్లుచుండగా మార్గమధ్యమున పోయినవి. ఎంత వెతికినా దొరకలేదు. మా క్లయింటు సదరు ది. 16-05-1991 క్రయదస్తావేజు నెం. 3323/1991 ఎక్కడా హామీలు, తనఖాలు పెట్టియుండలేదు అని తెల్పినారు. పోయిన ది. 16-05-1991 క్రయ దస్తావేజు నెం. 3323/1991 ఎవరికైన దొరికన ఎడల వాటిని క్రింది అడ్రస్‌కు అప్పగించవలెను. పైపోయిన క్రయదస్తావేజు నెం. 3323/1991ల పై ఎవరికైన ఏమైనా అక్షేపణలు వున్నఎడల వారి అక్షేపణలు 15 రోజులలో వ్రాతపూర్వకంగా ఈ దిగువ అడ్రస్‌కు తెలుపుకోవలెను. గడువు తదుపరి వచ్చు అక్షేపణలు మా క్లయింటును బైండు చేయవని తెలియజేయడమైనది.

షెడ్యూల్

రాజమహేంద్రవరం రూరల్ మండలం, ధవళేశ్వరం, సాయినగర్, కాటన్‌పేట, డోరు నెం. 18-123/3=13-202, అర్.ఎస్.నెం. 125/2, ప్లాట్ నెం. 8లో 252 చ.గ.లులో గల డాబా యిల్లుకు హద్దులు, కొలతలు: **తూర్పు:** 24 వెడల్పు గల రోడ్డు 36'-0", **దక్షిణం:** అర్.ఎస్.నెం. 132 దాఖలా భూమి 63'-0", **పడమర:** ప్లాట్ నెం. 1 స్థలం 36'-0", **ఉత్తరం:** ప్లాట్ నెం. 7 స్థలం 63'-0". ఈ హద్దుల మధ్య 252 చ.గ.లు- 210.69 చ.మీ. డాబా యిల్లు యావత్తు యాజిమెంటు హక్కులతో సహా.

పుత్రేవు రంగ సాయి మిత్ర
అడ్వకేట్ & నోటరీ
శేషయ్యమెట్ట, కోర్టులు వెనుక, రాజమండ్రి
సెల్ నెం. 9849713454